సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



టెన్నిస్ టు సర్వీస్
టెన్నిస్‌తో పాటు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.. బోయలపల్లి రేఖ.
- 8లో



నూతన విద్యావిధానంతో ముప్పు
నూతన విద్యావిధానంతో విద్యావ్యవస్థకే ముప్పు ఏర్పడుతుందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు.
- 8లో



జోరుగా ఇసుక దందా
గుండాల మండల పరిధిలోని బిక్కేరు వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.
- 9లో

న్యూస్‌రీల్

మూడు రోజులు భగీరథ నీరు బంద్

రాజాపేట : మండలానికి వచ్చే మిషన్ భగీరథ నీటిని శనివారం నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ భువనగిరి సహాయ కార్యనిర్వాహక అధికారి సుమిత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేగంపేట వాగువద్ద పైపులైన్ ధ్వంసమైందని, మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో నీటిని సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

బొమ్మలరామారం : మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జెడ్పీ సీఈఓ రోజారాణి సందర్శించారు. 2022–23, 2023–24 వార్షిక నివేదికలు, రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అభివృద్ధి పనుల వివరాలు, జమ ఖర్చుల వివరాల్లో తేడారాకుండా పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, సూపరింటెండెంట్ గడ్డం జ్ఞానప్రకాష్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సంధ్యారాణి, శివ,కృష్ణ, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్లుగా బాధ్యతల స్వీకరణ



భువనగిరి : బాధ్యతలు స్వీకరిస్తున్న రామలింగం



ఆలేరు : బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

భువనగిరి : భువనగిరి మున్సిపల్ కమిషనర్‌గా రామలింగం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి శాలువాతో సన్మానించారు. అదే విధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు ఖమ్మం జిల్లా మణుగూరు మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై వెళ్లారు.

ఆలేరురూరల్ : ఆలేరు మున్సిపల్ నూతన కమిషనర్‌గా బి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న శ్రీనివాస్‌ను ఆలేరు మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు పనిచేసిన లక్ష్మి వారం క్రితం హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. అదే విధంగా వేకువ జామున సుప్రభాత సేవతో నిత్య పూజలు ప్రారంభించిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకార మూర్తులను తులసీదళాలతో అర్చించారు. అనంతరం ప్రథమ ప్రాకారమండపం, ముఖ మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.


బాలికల హాస్టల్ తనిఖీ



వలిగొండలో బాలికల హాస్టల్‌లో తనిఖీ చేస్తున్న జడ్జి ఉషశ్రీ

వలిగొండ : మండల కేంద్రంలోని శాంతి నిలయం బాలికల వసతిగృహాన్ని వలిగొండ మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ శుక్రవారం తనిఖీ చేశారు. భోజనం, కిచెన్, డార్మెటరీ హాల్, బాత్రూంలతో పాటు హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భోజనం, వసతులు ఎలా ఉన్నాయంటూ ఆరా తీశారు. ప్రభుత్వం నిబంధనల మేరకు విద్యార్థులకు వసతులు కల్పించాలని, నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ మామిడి వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు బాలగోని సాయిదీప్, శ్రీశైలం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాల చేరికతో నిండుకుండలా తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువు



గోదావరి గలగలలు

మల్లన్నసాగర్ ద్వారా నిరంతరాయంగా నీటి విడుదల

- ఆలేరు నియోజకవర్గంలో కళకళలాడుతున్న చెరువులు, చెక్‌డ్యాంలు
- బిక్కేరు, పాట్టిమర్రి, బేగంపేట, ఆలేరు పెద్దవాగులకు జలసిరి
- యాసంగి పంటలకు భరోసా
- నీటిని చూసి మురిసిపోతున్న రైతులు

కరువు నేలపై జలసిరులు సవ్వడి చేస్తున్నాయి. మల్లన్నసాగర్ నుంచి విడుదల చేస్తున్న గోదావరి జలాలతో ఆలేరు నియోజకవర్గంలోని చెరువులు, చెక్‌డ్యాంలు జలకళను సంతరించుకున్నాయి. వాగులూ పరవళ్లు తొక్కుతున్నాయి. నీటిని చూసి రైతు మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. యాసంగి పంటలకు నీటికి కొదవలేదన్న ధీమా కనిపిస్తోంది.



కల్వర్టుపై నుంచి పారుతున్న కొలనుపాక వాగు

ఆలేరు పరిధిలో పెరిగిన నీటిమట్టం

ఆలేరురూరల్ : ఆలేరు పెద్దవాగులోకి చేరుతున్న గోదావరి జలాలతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. బావులు, బోర్లలో నీటిమట్టం పెరిగింది. కొలనుపాక (బిక్కేరు) వాగులో పలుచోట్ల నిర్మించిన చెక్‌డ్యాంలు నిండుతున్నాయి. యాసంగి పంటలకు నీటి కొరత ఉండదని రైతులు అంటున్నారు.

యాదగిరిగుట్ట : మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు భారీగా చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో మల్లన్నసాగర్ ద్వారా బస్వాపూర్ రిజర్వాయర్, గంధమల్ల చెరువును నింపేందుకు అధికారులు జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి వద్ద గత ఏడాది సెప్టెంబర్ 22న సీఆర్ (క్రాస్ రెగ్యూలేటర్) తెరిచి నీటిని విడుదల చేశారు. 24వ తేదీన గంధమల్ల చెరువు పూర్తిగా నిండడంతో అదే నెల 25వ తేదీన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గంగమ్మకు పూజలు చేసి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ నీటితో రాజాపేట మండలం కాల్వపల్లి వద్ద ఉన్న పాట్టిమర్రి, ఆలేరు మండలం కొలనుపాక వాగుల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరుతోంది. అలాగే కొలనుపాక వాగులోనుంచి ఆలేరు పట్టణంలోని పెద్దవాగు మీదుగా ఆత్మకూరు(ఎం), గుండాల మండలాల్లోని చెరువులు, కుంటల్లోకి నీళ్లు చేరుతున్నాయి. మొదటి విడతగా నియోజకవర్గంలో 100కు పైగా చెరువులు నింపారు. వీటితో పాటు కుంటలు, చెక్‌డ్యాంలు కళకళలాడుతున్నాయి.



గుండాల మండలం అనంతారం పరిధిలో బిక్కేరు వాగులో పారుతున్న గోదావరి జలాలు

తీరనున్న సాగునీటి సమస్య

గోదావరి జలాల రాకతో ఆలేరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. యాసంగిలో రైతులకు సాగునీటి కష్టాలు తీరనున్నాయి. గంధమల్ల చెరువు దిగువ భాగమైన రాజాపేట మండలం బేగంపేట నుంచి గుండాల మండలం వరకు చెరువులు, వాగులు, చెక్‌డ్యాంల పరిధిలోని భూములన్నీ వరినాట్లతో కళకళలాడుతున్నాయి. సాగునీటితో పాటు తాగునీటి సమస్య కూడా తీరనుంది.

బిక్కేరు కళకళ

గుండాల : మండలంలోని అనంతారం, సుద్దాల పరిధిలో బిక్కేరు వాగు విస్తరించి ఉంది. గోదావరి జలాలతో వాగు జలకళను సంతరించుకుంది. వాగునుంచి బూర్జుబావి కుంట, వెల్మజాల ఊర చెరువు, రాగన్నకుంట, నవ్‌కుంట, చిప్పల కుంట, సీతారాంపురంలోని మొండి కుంట, వెంకయ్యకుంట, మరిపడిగలో ఎక్కువ చెరువు (పెద్ద కుంట), గాడిద కుంట, గంగాపురం ఊరచెరువు, నూనెగూడెం పెద్దచెరువు, బ్రాహ్మణపల్లిలోని జారుమండ్ల కుంటలు నిండాయి. పారుపల్లి, అంబాల, వంగాల, పెద్దపడిశాల వరకు సాగునీరు అందనుంది. వాగువెంట బావులు, బోర్లలో నీటి ఊట పెరిగిందని రైతులు చెబుతున్నారు.



కొరటికల్ వద్ద చెక్‌డ్యాం నిండా నీరు

నిండుకుండల్లా చెక్‌డ్యాంలు

ఆత్మకూరు(ఎం): మల్లన్నసాగర్‌నుంచి నీటికి తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా వస్తున్న గోదావరి జలాలు తోడవడంతో మండలంలోని రాయిపల్లి వద్ద బిక్కేరు వాగు నిండుగా ప్రవహిస్తోంది. వాగు పరిధిలో ఉన్న వీరుల చెరువు, ఆత్మకూరు(ఎం)–కొరటికల్ మధ్య చెక్‌డ్యాంలు నిండుకుండల్లా మారాయి.



పూర్తిగా నిండిన మల్లాపురం చెరువు

గుట్ట మండలంలో చెరువులన్నీ ఫుల్

యాదగిరిగుట్ట రూరల్ : మల్లన్నసాగర్ నుంచి బస్వాపురం రిజర్వాయర్‌కు వచ్చే ఓటీ–2 కెనాల్‌కు డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌లు ఏర్పాటు చేసి యాదగిరిగుట్ట మండలంలోని చెరువులను గోదావరి జలాలతో నింపారు. యాదగిరిగుట్ట మండలంలో 23 గ్రామాలు ఉండగా 21 గ్రామాల్లోని చెరువులు పూర్తిగా నిండాయి. ఇందులో మల్లాపురం, సైదాపురం, మాసాయిపేట, గౌరాయపల్లి గ్రామాల్లో నాలుగు పెద్ద చెరువులు ఉన్నాయి. వీటితో పాటుగా వంగపల్లి, మర్రిగూడెం, బాహుపేట, తాళ్లగూడెం, మైలార్‌గూడెం, రామాజీపేట, కాచారం, చిన్నకందుకూరు, యాదగిరిగుట్ట, సాధువెల్లి, దాతర్‌పల్లి, జంగపల్లి గ్రామాల్లో చిన్న చెరువులు, కుంటలు సైతం కళకళలాడుతున్నాయి.

వాగులు.. పరవళ్లు

రాజాపేట : మండలంలోని బేగంపేట, పాట్టిమర్రివాగుల్లోకి పెద్ద ఎత్తున గోదావరి జలాలు చేరుతున్నాయి. నీటి ఉధృతి పెరిగి కల్వర్టులపైనుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అలాగే బేగంపేట, చల్లూరు, కాల్వపల్లి, రఘునాథపురం గ్రామాల్లో చెక్‌డ్యాంలు అలుగుపారుతున్నాయి. పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




రఘునాథపురం వద్ద వాగులో నిర్మించిన చెక్‌డ్యాంపై నుంచి నీటి ప్రవాహం

గుట్ట చుట్టూ పర్యాటకం

యాదగిరి, స్వర్ణగిరి, భువనగిరి ఖిలా, కొలనుపాకతో టూరిజం సర్క్యూట్

- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.. ఆదాయ వనరుల పెంపే లక్ష్యం



సాక్షి, యాదాద్రి : జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు టూరిజం శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా యాదగిరిగుట్టతో పాటు దాని చుట్టూ ఉన్న సందర్శనీయ స్థలాలను కలిపి టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయనుంది. ఇప్పటికే భువనగిరి కోట అభివృద్ధి పనులు కొనసాగుతుండగా.. మిగతా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందిస్తోంది.

టూరిజం సర్క్యూట్‌లోకి ఈ ప్రాంతాలు..

హైదరాబాద్‌కు చేరువలో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎన్నో సందర్శనీయ స్థలాలు ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ఆదాయ వనరులు పెరగనున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా యాదగిరి క్షేత్రం కేంద్రంగా భువనగిరి ఖిలా, స్వర్ణగిరి, రాయగిరి చెరువు, నృసింహసాగర్ రిజర్వాయర్, కొలనుపాక వీరశైవ, జైన దేవాలయాలను టూరిజం సర్క్యూట్‌లోకి తేనుంది.

భువనగిరి ఖిలాకు రూ.100 కోట్లు మంజూరు

స్వదేశీ దర్శన్ పథకం కింద ఇప్పటికే కేంద్రం రూ.100 కోట్లు భువనగిరి ఖిలాకు కేటాయించింది. తొలి విడతలో విడుదల చేసిన రూ.56 కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలిదశలో పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులను, అభివృద్ధి పనులను చేపడుతున్నారు. ఖిలాపైకి మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేస్తారు. తీగెలవంతెన రోప్‌వే, స్వాగత తోరణం, టికెట్ కౌంటర్, ఖిలాపై ఉన జైలును డిజిటల్ ప్రదర్శన శాలగా మార్చనున్నారు. అలాగే ఖిలా కింది భాగంలో అమ్మకుంట వరకు ఆరులైన్ల రోడ్డును నిర్మిస్తారు.రోడ్డుకు ఇరువైపులా సుందరీకరణ చేపడుతారు. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలుకల్పించడానికి వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేస్తారు. ఈ పనులను నాలుగు ప్యాకేజీల్లో చేపడుతారు. ప్రస్తుతం మొదటి విడత ప్యాకేజీ పనులు టెండర్ల దశలో ఉన్నాయి.

గతంలోనే ప్రతిపాదనలు

జిల్లాలోని భువనగిరి ఖిలాతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన బస్వాపూర్ రిజర్వాయర్ గతంలోనే పర్యాటక రంగం పరిధిలోకి తెచ్చారు. భువనగిరి నుంచి బస్వాపూర్ రిజర్వాయర్ మీదుగా యాదగిరిగుట్ట, కొలనుపాక వరకు టెంపుల్ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా వైటీడీఏ అప్పట్లో ముసాయిదా రూపొందించింది. కొలనుపాక సోమేశ్వరాలయానికి రూ.200 కోట్లు కేటాయించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. కొలనుపాకకు దేశం నలుమూలల నుంచి వీరశైవ, జైనభక్తులు నిత్యం వస్తుంటారు. హైదరాబాద్– వరంగల్ మార్గం మధ్యలో కొలనుపాక ఉంది. ఇటీవల భువనగిరి వద్ద నిర్మించిన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి క్షేత్రాలకు భక్తులు పోటెత్తుతున్నాయి. పర్యాటకపరంగా అన్ని హంగులు కలిగి ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాలో మౌలిక వసతులు కల్పించి, విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా పర్యాటకంగా అభివృద్ధి చేసి, ఆదాయాన్ని పొందే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రెండు నూతన పంచాయతీలకు గెజిట్

- 428కి చేరిన గ్రామ పంచాయతీలు
- ఎన్నికలకు సిద్ధమవుతున్న యంత్రాంగం



కలెక్టరేట్‌కు చేరిన బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

సాక్షి,యాదాద్రి : పెండింగ్‌లో ఉన్న రెండు నూతన గ్రామ పంచాయతీలకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. దీంతో జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు 428కి చేరాయి. ఏడు నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేస్తూ ఆగస్టులో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో గుర్జవానికుంట, తుర్కపల్లి మండలంలోని ఇందిరానగర్ సాంకేతిక కారణాలతో పెండింగ్ ఉండగా శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. 428 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి యంత్రాంగం సన్నద్ధవుతోంది. కలెక్టరేట్‌కు చేరిన బ్యాలెట్ పేపర్లను అదనపు కలెక్టర్ గంగాధర్ పరిశీలించారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ : స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీజేపీ మున్సిపల్, మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు బీఆర్‌ఎస్‌ను మరిచిపోయారని, హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీ సైతం అనతికాలంలోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం చేయాలని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్ బాబు, నాయకులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, గుజ్జుల సురేందర్‌రెడ్డి, పాలకూర్ల జంగయ్య, ఊడుగు యాదయ్య, కాయితి రమేష్‌గౌడ్, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, వనం ధనుంజయ్య, తడక సురేఖ, గోశిక నీరజ, ఉబ్బు భిక్షపతి, అమృతం దశరథ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాల్సిందే

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

భువనగిరి : లక్ష డప్పుల గుండె చప్పుడు ప్రభుత్వం వింటే మంచిదని లేకుంటే.. భవిష్యత్తును తేల్చుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరగనున్న లక్ష డప్పులు–వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి అమలు చేయడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మూడు కమిషన్లు తీర్పు ఇచ్చాయన్నారు. బీసీలకు నాయకత్వం వహిస్తున్న ఆర్.కృష్ణయ్య నాలుగు కండువాలు మార్చి పదవులు పొందాడని, 36 ఏళ్లనుంచి తాను ఏ పదవీ తీసుకోకుండా ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. అన్ని పార్టీలు, ప్రధాన మంత్రి, మంత్రులు అనుకూలంగా ఉన్నా.. కాంగ్రెస్ పార్టీలోని మాలలే అడ్డుకుంటున్నట్లు చెప్పారు. సమావేశానికి ముందు భువనగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ భువనగిరి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేవేందర్, చంద్రస్వామి, శ్రీనివాస్, శంకర్, గణేష్, దానయ్య, లింగస్వామి, కరుణాకర్, హరీష్, బట్టు రాంచంద్రయ్య, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



'లక్ష డప్పులు.. వేల గొంతులు' సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

అల్పాహారానికి నిధులొచ్చాయి

రూ.25,61,580 విడుదల

- పదో తరగతి విద్యార్థులకు తీరనున్న ఆకలి
- నేటినుంచి మార్చి 20వ తేదీ వరకు సాయంత్రం సమయంలో స్నాక్స్
- మొత్తం 4,494 మంది విద్యార్థులు



ప్రత్యేక తరగతులకు హాజరైన పదో తరగతి విద్యార్థులు

భువనగిరి : ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు మార్గం సుగమం కానుంది. ఈనెల 1నుంచి మార్చి 20వ తేదీ వరకు 38రోజుల పాటు అల్పాహారం అందించేందుకు నిధులు మంజూరయ్యాయి. ఉత్తీర్ణత శాతం పెంపే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా 163 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు నవంబర్ నుంచి ప్రత్యేక తరగతులు, రివిజన్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతులు ముగిసిన అనంతరం సుదూర ప్రాంతాల విద్యార్థులు వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు రాత్రి సమయం 7 దాటుతుంది. మధ్యాహ్నం భోజనం చేసిన విద్యార్థులు రాత్రి వరకు ఉండలేకపోతున్నారు. వారిలో అలసట, నీరసం, చేరి చదువుపై దృష్టి సారించకపోతున్నారు. ఇలా రెండు నెలలు దాటింది. దీనిని గుర్తించిన ప్రభుత్వం అల్పాహారం అందించేందుకు ముందుకువచ్చింది.

ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 ఖర్చు

జిల్లా వ్యాప్తంగా 9 వేలకు పైగా పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఇందులో ప్రైవేట్, కస్తూర్బాలు, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు మినహాయించి 4,494 మంది మంది విద్యార్థులున్నారు. వీరిలో ఒక్కో విద్యార్థికి ప్రతి రోజూ రూ.15ల చొప్పున అల్పాహారానికి ఖర్చు చేసేలా జిల్లాకు 38 రోజులకు రూ.25,61,580 విడుదల అయ్యాయి. ఈ నిధులతో రోజూ సాయంత్రం ఉడికించిన శనగలు, బిస్కెట్లు, ఇతర అల్పాహారం అందించనున్నారు. కాగా అల్పాహారం మధ్యాహ్న భోజన నిర్వాహకులు అందించాలని సూచించారు. అల్పాహారం అందజేసినందుకు నిర్వాహకులకు పారితోషికం ఇస్తారా లేదా.. స్పష్టత ఇవ్వలేదు.

పాఠశాలల ఖాతాల్లో జమ చేశాం

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో నవంబర్ నుంచే ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. డిసెంబర్‌లో సిలబస్ పూర్తిచేసి జనవరి 1వ తేదీ నుంచి ఉదయం సాయంత్రం, సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నా ఇప్పటి వరకు అల్పాహారం అందజేయడం లేదు. సాయంత్రం సమయంలో అల్పాహారం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వీటిని పాఠశాలల గ్రాంట్స్ కింద జమ చేశాం. ఒక్కో విద్యార్థికి రోజూ రూ. 15 చొప్పున ఖర్చు చేయనున్నాం. విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలి.

–సత్యనారాయణ, డీఈఓ

క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగింది. తాళ్లగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బత్తిని భాస్కర్ రోజుమాదిరిగానే శుక్రవారం ఉదయం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. నిరుపేదలమైన తమను ప్రభుత్వం ఆదుకోవాలని భాస్కర్ కుటుంబ సభ్యులు కోరారు.

చికిత్స పొందుతూ మృతి

భువనగిరి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణానికి చెందిన మహ్మద్ నన్నెసాబ్(33)కు తన భార్య షాహిన్ బేగంతో గత మూడేళ్ల నుంచి గొడవలు జరుగుతున్నాయి. దీంతో నన్నెసాబ్ వలిగొండ మండలం సంగెం గ్రామంలో ఓ రైతు వద్ద కూలీ పనిచేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. అప్పుడప్పుడు చౌటుప్పల్‌లోని తన సోదరుడి ఇంటికి గాని భార్య ఇంటికి గాని వెళ్తుంటాడు. ఈ నెల 25వ తేదీ ఉదయం ఇంటికి వెళ్తున్నానని సంగెం గ్రామంలోని తాను నివాసముంటున్న రైతుకు చెప్పి వెళ్లాడు. గురువారం రాత్రి భువనగిరి బైపాస్ రోడ్డులో నల్లగొండ ఫ్లైఓవర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నన్నెసాబ్‌ను వాహనదారులు 108 వాహనంలో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు లారీలు ఢీ

ఆలేరురూరల్: ఆలేరు బైపాస్ రోడ్డులో గురువారం అర్ధరాత్రి రెండు లారీలు ఢీకొన్నాయి. శుక్రవారం ఆలేరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న రెండు లారీలు ఆలేరు బైపాస్‌లోకి రాగానే కందిగడ్డతండా సమీపంలో ముందున్న లారీని వెనకున్న లారీ ఢీకొట్టింది. వెనకున్న లారీ డ్రైవర్ పవన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐఐఎస్‌సీ అధ్యాపకుడు గోపాల్ హెగ్డే

నల్లగొండ టూటౌన్: ఇంజనీరింగ్‌లో ఉపాధి అవకాశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) బెంగళూరు అధ్యాపకుడు డాక్టర్ గోపాల్ హెగ్డే అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌లో ఉపాధి అవకాశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆప్టికల్ ఫైబర్ సెన్సార్, ఆప్టికల్ ఫైబర్ కమ్యూనికేషన్స్ సోలార్ సేల్స్, లైడార్ వంటి అధునాతన టెక్నాలజీపై ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సుధారాణి, డా. హరీష్‌కుమార్, డా. ఎం. జయంతి, కె. మౌనిక, వై. నాగరాజు, అవినాష్ బాబు, కె. మౌనిక, హుమా అఫ్రిన్, రాజేశ్వరి, స్వర్ణలత, లావణ్య, రంగారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

గుండ్రాంపల్లి అబ్బాయి.. ఇండోనేషియా అమ్మాయి



మూడుముళ్లబంధంతో ఒక్కటైన నాగరాజు, రిజ్కి నన్‌డా సఫిత్రి

చిట్యాల: చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన యువకుడు నాగరాజు ఇండోనేషియా అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. వీరి వివాహం శుక్రవారం గుండ్రాంపల్లి గ్రామంలో జరిగింది. సీమ సాలయ్య-యాదమ్మ ప్రథమ కుమారుడు నాగరాజు హైదరాబాద్‌లో ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నాగరాజు పనిచేస్తున్న కంపెనీలోనే ఇండోనేషియాలో రిజ్కి నన్‌డా సఫిత్రి అనే యువతి కూడా పనిచేస్తోంది. వీరిద్దరికి ఫోన్‌లో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. ఇరువురు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పెద్దల అంగీకారంతో హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని రిజ్కి నన్‌డా సఫిత్రిని నాగరాజుకు ఇండియాకు పిలిపించాడు. నాగరాజు స్వగ్రామం గుండ్రాంపల్లిలో శుక్రవారం వేద మంత్రాల సాక్షిగా ఇద్దరూ ఒక్కటయ్యారు. ఈ వివాహానికి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

డ్రిల్‌మ్యాన్ క్రాంతికుమార్ సాహసం

- గొంతులో కత్తితో డీసీఎంతో సహా పది మందిని లాగిన క్రాంతికుమార్



కత్తి పెట్టుకుని డీసీఎంను లాగుతున్న క్రాంతికుమార్ (ఇన్‌సెట్‌లో) నోట్లో కత్తి పెట్టుకుంటున్న దృశ్యం

అడ్డగూడూరు: డ్రిల్‌మ్యాన్‌గా పేరుగాంచిన అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన పనికెర క్రాంతికుమార్ మరో సాహసం చేశారు. శుక్రవారం అడ్డగూడూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గొంతులోకి రెండు అడుగుల పొడవైన కత్తిని దించుకుని నాలుగు టన్నుల బరువున్న డీసీఎంపై పది మందిని ఎక్కించి లాగాడు. క్రాంతికుమార్ సాహసం చూసి మండల ప్రజలు అతడిని అభినందించారు. కార్యక్రమంలో క్రాంతికుమార్ అన్న సూర్యకుమార్, తండ్రి సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాచకొండ రమేష్, నాయకులు బొమ్మగాని లక్ష్మయ్య, భిక్షంరెడ్డి, వల్లంభట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అడవి దున్న కోసం ముమ్మర గాలింపు

- డ్రోన్ కెమెరా సహాయంతో ఆచూకీ కనిపెట్టేందుకు అధికారుల ప్రయత్నం



డ్రోన్ కెమెరా ద్వారా గాలింపు



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న భువనగిరి జిల్లా ఫారెస్ట్ అధికారి పద్మజారాణి

ఆత్మకూరు(ఎం): రెండు రోజులుగా ఆత్మకూరు(ఎం) మండలంలో హడలెత్తిస్తున్న అడవి దున్న కోసం ఫారెస్ట్ అధికారులు, పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. గురువారం ఉదయం పల్లెర్ల గ్రామ సమీపంలోని పెసర్లబండ వద్ద జామాయిల్ తోటలో అడవి దున్నను గ్రామస్తులు చూసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులంతా అక్కడకు చేరుకుని అడవి దున్నను తరమడంతో రాఘవారం, నర్సాపురం, పల్లెర్ల గ్రామాల మధ్య ఓ వెంచర్ పక్కన చెట్ల పొదలోకి వెళ్లింది. భువనగిరి జిల్లా ఫారెస్ట్ అధికారి పద్మజారాణి ఆధ్వర్యంలో చౌటుప్పల్, యాదగిరిగుట్ట, భువనగిరి రేంజ్ ఫారెస్ట్ అధికారులు గురువారం రాత్రి వరకు అడవి దున్న కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. తిరిగి శుక్రవారం డ్రోన్ కెమెరాలతో పాటు ఫారెస్ట్ అధికారులు, పోలీసులు బృందాలుగా విడిపోయి గాలింపు చర్యలు చేపట్టారు. వలిగొండ మండలం నర్సాపురం వైపు వెళ్లినట్లుగా కొందరు అనుమానిస్తున్నారు. రెండ్రోజులు అయినా అడవి దున్న ఆచూకీ తెలియకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

సాంకేతిక, స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మండలం జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో సాంకేతిక, స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఇంటర్మీడియట్, అకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ టూవీలర్ కోర్సుకు పదో తరగతి పాసై ఉండాలని అన్నారు. సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ కోర్సుకు పదో తరగతి, ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్) కోర్సుకు ఐటీఐ లేదా పదో తరగతి, సోలార్‌సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఐటీఐ కల్గి ఉండాలని అన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య మయస్సు కల్గి ఉండాలని అన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పించబడుతుందని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులు తప్పనిసరిగా ఉద్యోగం కూడా కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల 3న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ప్రాధాన్యత కల్పించబడుతుందని అన్నారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎండు మిర్చి దగ్ధం

గుర్రంపోడు: మండలంలోని కాల్వపల్లి గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు ఎండు మిర్చి కుప్పకు నిప్పంటుకుని దగ్ధమైంది. కాల్వపల్లి గ్రామానికి చెందిన రైతు బాతుక మల్లేష్ మూడెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశాడు. సుమారు 15క్వింటాళ్ల మిర్చిని ఏరించి కుప్ప పోయించి దానిపై ప్లాస్టిక్ కవర్ కప్పి ఉంచాడు. శుక్రవారం మధ్యాహ్నం మిర్చి కుప్పకు నిప్పంటుకుని దగ్ధమైంది. సమీప రైతులు గుర్తించి ఐదు క్వింటాళ్ల మిర్చిని కుప్ప నుంచి పక్కకు తీశారు. పది క్వింటాళ్ల మిర్చి పూర్తిగా కాలిబూడిదైంది. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని, నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరాడు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

రామగిరి(నల్లగొండ): ఒంటరితనం భరించలేక వృద్ధుడు ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం నల్లగొండ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం రెడ్డికాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని బట్టపోతులగూడెంకు చెందిన సుంకరబోయిన మల్లయ్య(88) భార్య చాలా ఏళ్ల క్రితం మృతి చెందింది. వారికి సంతానం లేదు. మల్లయ్య తన సోదరి ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్నాడు. జీవితంపై విరక్తితో మల్లయ్య శుక్రవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బావ భిక్షమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నల్లగొండ రూరల్ ఎస్‌ఐ డి. సైదాబాబు తెలిపారు.

నూతన విద్యావిధానంతో విద్యావ్యవస్థకే ముప్పు



జిల్లా మహాసభల సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

భూదాన్‌పోచంపల్లి : జాతీయ నూతన విద్యావిధానంతో విద్యావ్యవస్థకే ముప్పు ఏర్పడుతుందని, వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నూతన విద్యావిధానాన్ని రద్దు చేస్తున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. అదేవిధంగా యూనివర్సిటీలపై పెత్తనం చెలాయించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న యూజీసీ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూజీసీ విధానం రాష్ట్ర ప్రభుత్వ హక్కులను కాలరాయడమేనన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖమంత్రి లేకపోవడంతో విద్యారంగం గాడి తప్పిందన్నారు. పెండింగ్‌లో రూ.8,300 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కల్లూరి మల్లేశం, జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కుక్కట్ల శివానీ, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె శివకుమార్, వేముల నాగరాజు, కాసుల నరేష్, సహాయ కార్యదర్శి గంగదేవి సాయినాథ్, జిల్లా కమిటీ సభ్యులు జగన్, శ్రీనివాస్, ఉదయ్, పవన్, ప్రజాసంఘాల నాయకులు కొండమడుగు నర్సింహ, కోట రాంచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, జగన్, లింగారెడ్డి, మంచాల మధు, శ్రీహరి, అనిల్, వికాస్, నందు, విక్రమ్, రాకేశ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ TO సర్వీస్

సంకల్పమే సగం విజయమన్నారు పెద్దలు.. కృషితో ఉన్నత శిఖరాలను చేరుకొన్న కొంత మంది మహిళలను ఆదర్శంగా తీసుకున్న ఆమె లేటు వయస్సులో టెన్నిస్ క్రీడపై మక్కువ పెంచుకొంది. ఇద్దరు పిల్లల తల్లి అన్న విషయాన్ని పక్కన పెట్టి భర్త ప్రోత్సాహంతో కఠోర శ్రమతో అంతర్జాతీయ క్రీడాకారిణిగా రాణించింది. దాంతో సంతృప్తి చెందకుండా నేను సైతం అంటూ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అడివెంలకు చెందిన బోయలపల్లి రేఖ.



స్కూల్ పిల్లలకు పుస్తకాలు అందజేస్తున్న రేఖ

- ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత టెన్నిస్ ఆటలోకి ప్రవేశం
- కఠోర సాధనతో జాతీయ క్రీడాకారిణిగా ఎదిగిన రేఖ
- కరోనా కారణంగా ఆటకు ఫుల్‌స్టాప్
- స్వచ్ఛంద సేవా కార్యక్రమాలపై దృష్టి
- పలువురు ప్రముఖుల నుంచి అభినందనలు
- సొంతగడ్డకు సాయమందిస్తున్న రేఖ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు



రేఖను అభినందిస్తున్న అప్పటి గవర్నర్ తమిళిసై



స్ఫూర్తి

అర్వపల్లి: హైదరాబాద్‌లో రేఖ ఎంబీఏ చదువుతుండగా కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ షోలో పాల్గొంది. అదే సమయంలో ఆల్బమ్ చిత్రీకరణ పనిలో ఉన్న సినీ దర్శకుడు అగస్త్య హీరోయిన్ కోసం వెతుకుతున్నాడు. ఆయన రేఖను ఎంపిక చేశాడు. కానీ, రేఖను ఆల్బమ్‌లో నటింపజేసేందుకు కాకుండా తన జీవిత భాగస్వామిగా ఉండేందుకు ఒప్పించి పెళ్లి చేసుకున్నాడు. వారు పెళ్లి చేసుకుని ల్యాంకోహిల్స్‌లో కాపురం పెట్టారు. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకోవడానికి ఇరుగుపొరుగు మహిళలతో కలిసి జిమ్ చేయడంతో పాటు టెన్నిస్ ఆడేవారు. అప్పుడే ఆమె ప్రొఫెషనల్ ప్లేయర్ కావాలని నిర్ణయించుకున్నారు.



ముంబైలో కోచింగ్..

తన భర్త అగస్త్య.. హిందీ సినిమాల్లో పనిచేసేందుకు ముంబైకి వెళ్లాల్సి వచ్చింది. భర్తతోపాటు రేఖ కూడా తన ఇద్దరు పిల్లలను వెళ్లారు. అప్పుడు రేఖ ముంబైలోని 'ప్రాక్ టెన్నిస్' అనే అకాడమీలో చేరి కఠోర సాధన చేశారు. ఉదయం 5 గంటలకే గ్రౌండ్‌లో ఉండేవారు. 6.30 గంటల వరకు ప్రాక్టీస్ చేసి 7.30 గంటలకు ఇంటికి వెళ్లి పిల్లలను రెడీచేసి స్కూల్‌కు పంపించేవారు. తిరిగి సాయంత్రం 4.30 గంటలకు అకాడమీకి వెళ్లి ముందుగా జిమ్ చేసి ఒక గంటపాటు టెన్నిస్ ప్రాక్టీస్ చేసేవారు.

స్పెయిన్‌కు పయనం

జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనాలంటే.. ముంబైలో ప్రాక్టీస్ సరిపోదని, విదేశాలకు వెళ్లాలని రేఖకు తన భర్త అగస్త్యతో పాటు పలువురు సలహా ఇచ్చారు. దాంతో ఆమె యూరప్‌లోని స్పెయిన్‌కు వెళ్లి అక్కడ 'ముస్‌డో' స్పోర్ట్స్ అకాడమీలో చేరారు. భర్త, పిల్లలు ముంబైలోనే ఉంచి ఆమె ఒక్కరే స్పెయిన్ వెళ్లి రెండు నెలలపాటు స్పెయిన్‌లో కోచింగ్ తీసుకున్నారు. ఆమెకు ఎవరూ స్పాన్సర్‌షిప్ లేకపోవడంతో సొంత ఖర్చులతోనే స్పెయిన్ వెళ్లారు.

సింగిల్స్‌గానే..

రేఖ మొదట ఏఐటీ(ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్)లో రేఖకు మొదట సింగిల్స్ ఆడే అవకాశం వచ్చింది.. తన వ్యక్తిగత కారణాల వల్ల డబుల్స్ ఆడలేదు. ఐటీఎఫ్ (ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్)లో ఆడారు. ఆ తర్వాత థాయిలాండ్‌తో పాటు వివిధ దేశాల్లో ఆడారు.

ఆటకు 'లాక్‌డౌన్'

రేఖ వివిధ దేశాల్లో ఆడుతూ బిజీ అవుతున్న సమయంలో వచ్చిన లాక్‌డౌన్‌తో ఆటకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సి వచ్చింది. లాక్‌డౌన్ సమయంలో ఆమె హైదరాబాద్‌లోని ల్యాంకోహిల్స్‌లో ఉన్నారు. తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌ల పక్కన వివిధ రాష్ట్రాలకు చెందిన వేల మంది తిండికి ఇబ్బంది పడడం రేఖ చూసి చలించిపోయారు. ఆ కూలీలకు ఆమె స్వయంగా అన్నం వండిపెట్టారు. అప్పుడే తనకు సేవ చేయాలనే ఆలోచన వచ్చి 'రేఖా చారిటబుల్ ఫౌండేషన్' ఏర్పాటు చేశారు. తన ఫౌండేషన్ నుంచి కరోనా సమయంలో రోజుకు 2వేల మందికి భోజనం వండిపెట్టారు. వివిధ రాష్ట్రాల వారికి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి వారిని స్వస్థలాలకు పంపారు. ఆ సమయంలో రేఖకు సేవా రంగంలో మంచి గుర్తింపు వచ్చింది. ఆయా రాష్ట్రాల సీఎంల నుంచి అభినందనలు అందుకున్నారు. అంతేకాకుండా 'రేఖ స్పోర్ట్స్ ఫౌండేషన్'ను కూడా స్థాపించి క్రీడాకారులను ఆమె ప్రోత్సహిస్తున్నారు.



కరోనాలో ఆహారం పంపిణీ చేస్తున్న రేఖ



2021లో అప్పటి గోవా సీఎం ప్రమోద్ సావంత్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న రేఖ



సొంత నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు

రేఖ తన సొంత నియోజకవర్గమైన తుంగతుర్తి నియోజకవర్గంలో సేవా కార్యక్రమంలో ముమ్మరం చేశారు. జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ విద్యా సంవత్సరం 30 ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు నోటు పుస్తకాల పంపిణీ చేశారు. క్రీడా దుస్తులు ఇచ్చారు. ఆర్ఓ ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. క్రీడా సామగ్రి అందజేశారు. తాను చదువుకున్న అడివెంల గ్రామ ప్రాథమిక పాఠశాలకు రూ.3లక్షలతో మరమ్మతులు చేయించి క్రీడా సామగ్రి, ఆరో ప్లాంట్ పెట్టించారు. తాను చేసే సేవ రాజకీయాల కోసం కాదని, కేవలం సేవా దృక్పథంతోనేనని రేఖ చెబుతున్నారు.

రైతుల సొమ్ము కాజేసిన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్

- పోస్టాఫీస్ ఖాతాల్లో జమ అయిన రూ.14లక్షలు నొక్కేసి జల్సాలు
- మరో రూ.6లక్షలు పింఛన్ డబ్బులు కూడా..

చందంపేట: నేరెడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గ్రామానికి చెందిన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ రెడ్యానాయక్ ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతరత్రా జల్సాలకు అలవాటుపడి రైతుల పోస్టాఫీస్ ఖాతాల్లో జమ అయిన పత్తి డబ్బులను కాజేశాడు. కాచరాజుపల్లి గ్రామ రైతులు బొమ్ము లక్ష్మమ్మ, బొమ్ము వెంకటమ్మ, వడ్య బాలు, ముని, అంజి, వాంకుడావత్ నాను ఖాతాల్లో నుంచి సుమారు రూ.14లక్షల వరకు డబ్బులు కాజేసి ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర జల్సాలకు వినియోగించినట్లు తెలుస్తోంది. నగదు జమ అయినట్లు మెసేజ్ వచ్చిన తెల్లారి నగదును డ్రా చేసుకుందామని అనుకున్న రైతులు తమ పోస్టాఫీస్ ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో అవాక్కయ్యారు. బీపీఎం నగదును కాజేసినట్లు నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నేరెడుగొమ్ము పోలీసులు బీపీఎం రెడ్యానాయక్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

రూ.6లక్షలు పింఛన్ డబ్బులు కూడా..

కాచరాజుపల్లి గ్రామానికే చెందిన పింఛన్‌దారులకు చెల్లించాల్సిన రూ.6లక్షలు సైతం బీపీఎం రెడ్యానాయక్ కాజేసినట్లు నిర్ధారణ అయ్యింది. ఇదిలా ఉంటే రెడ్యానాయక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల నుంచి నాలుగు నెలల క్రితమే నేరెడుగొమ్ము మండలంలో పోస్టింగ్ పొందినట్లు సమాచారం.

నార్కోటిక్స్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం రాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్స్ డ్రగ్ స్నైపర్ డాగ్‌స్క్వాడ్‌తో వచ్చిన పోలీసులు ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పలు లాడ్జీల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ నాగార్జున మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలతో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. అనుమానిత ప్రాంతాలతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేయడంతో పాటు నేరాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాంబాబుతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్యాలగూడలో యువకుడికి కత్తి పోట్లు

- పరారైన నలుగురు వ్యక్తులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



బాధితుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్‌ఐ సైదిరెడ్డి

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఓ యువకుడిపై నలుగురు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన అల్లం మహేష్ కుటుంబ సభ్యులు 30ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మంద మహేష్, మంద శేఖర్ తాత వద్ద పొలం కొన్నారు. పొలం విక్రయించిన తర్వాత మంద మహేష్, మంద శేఖర్ తాత అప్పట్లో కుటుంబంతో సహా మిర్యాలగూడ పట్టణానికి వచ్చి ఇక్కడే స్థిరపడ్డాడు. తమ తాత అమ్మిన పొలం తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అల్లం మహేష్ కుటుంబ సభ్యులతో పలుమార్లు మంద మహేష్, మంద శేఖర్ గొడవకు దిగారు. తాము పొలం కొన్నట్లు అన్ని ఆధారాలను అల్లం మహేష్ కుటుంబ సభ్యులు చూపించగా.. మంద మహేష్, మంద శేఖర్ ఎలాంటి ఆధారాలు చూపలేదు. ఇదే విషయమై గతేడాది అల్లం మహేష్ కుటుంబ సభ్యులపై మంద మహేష్, మంద శేఖర్ దాడి చేయడంతో.. వారిపై కేసు పెట్టారు. ఈ కేసు ఇప్పటికీ కోర్టులో నడుస్తోంది. కాగా శుక్రవారం పని నిమిత్తం మిర్యాలగూడ వచ్చిన అల్లం మహేష్‌ను పట్టణంలోని కోర్టు ఎదుట మంద శేఖర్, మంద మహేష్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు అడ్డుకుని.. 'కొడితే కేసు పెట్టావు.. ఇప్పుడు నిన్ను చంపితే ఎక్కడ కేసు పెడతావురా' అంటూ జేబులోని కత్తి తీసి అల్లం మహేష్ మెడపై పొడిచారు. అల్లం మహేష్ రక్తం కారుతుండగానే వారిని వదిలించుకుని కోర్టు ఆవరణలోకి పరిగెత్తగా.. ఆ నలుగురు అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు బైక్‌పై అల్లం మహేష్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా తక్షణమే ఆస్పత్రిలో చేర్చాలని పోలీస్ సిబ్బంది సూచించారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ ఎస్‌ఐ సైదిరెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధితుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.